ప్రజాశక్తి

ఆదివారం 11 జూన్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అసంపూర్తిగా నాడు - నేడు పనులు



- రేపు పాఠశాలలు పున: ప్రారంభం
- గతేడాదీ వెంటాడిన 'విలీన' సమస్యలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వేసవి శెలవుల అనంతరం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు ప్రారంభించిన వెంటనే విద్యాకానుక కిట్ల పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1183 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా నాడు-నేడులో రెండో దశలో 563 పాఠశాలల్లో పనులు చేపట్టారు. ఇందుకోసం రూ.215.75

2లో



జాతాలోమాట్లాడుతున్న వై రాధాకృష్ణ

కౌలు రైతు చట్టాన్ని సవరించాల్సిందే..

కౌలురైతు సంఘం రాష్ట్ర జాతా డిమాండ్ - పెదకాకాని, దుగ్గిరాల, తెనాలి మండలాల్లో పర్యటన

5లో



మంగళగిరి సమావేశంలో సిపిఎం, సిపిఐ నాయకులు

అమిత్ షా గోబ్యాక్..

నేటి నిరసనను జయప్రదం చేయండి

సిపిఎం, సిపిఐ నాయకుల పిలుపు

2లో

8లో

విద్యుత్ ఛార్జీల భారం సశేషం!



వీక్షణం

అసంపూర్తిగా నాడు - నేడు పనులు

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు ఖర్చుచేయనున్నారు. మొత్తం 145 తరగతి పాఠశాలలు, 838 తరగతి గదులు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగినట్టు అధికారులు చెబుతున్నా ఈమేరకు తగిన వసతులను సకాలంలో పెంచలేకపోయారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 3,4,5 తరతుల విలీనంతో విద్యార్థుల సంఖ్య పెరిగినా తగిన సౌకర్యాలు పెంచలేకపోయారు. గత ఏడాది విలీనం అయిన 3,4,5 తరగతుల విద్యార్థుల పడిన ఇబ్బందులు అన్ని ఇన్నీ కావు. ఈనేపథ్యంలో మొత్తం 165 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని నాడు నేడులో రెండోదశలో చేపట్టారు. ఈపనులు ఇంత వరకు పూర్తికాలేదు. ఈ పనులు వివిధ దశల మధ్య ఉన్నాయి. దీంతో సోమవారం నుంచిపాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఎక్కడ కూర్చోవాలన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది. అలాగే విద్యాకానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు అందచేస్తామని ప్రకటించినా ఇంత వరకుపూర్తి స్థాయిలో సరఫరా జరగలేదని చెబుతున్నారు. పాఠ్యపుస్తకాలు 60 నుంచి 70 శాతం వరకు జిల్లాకు వచ్చాయి. గతేడాది ప్రభుత్వం తీసుకున్న అస్తవ్యస్తమైన నిర్ణయాల వల్ల గుంటూరుజిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒకటి నుంచి 10 వరకు మొత్తం 1683 పాఠశాలలు ఉండగా వీటిల్లో 3,.02,428 మంది విద్యార్థులు ఉన్నారు.వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో 1,07,837మంది ఉండగా ప్రైవేటు పాఠశాలల్లో 1,81,613 మంది ఉన్నారు.ఎయిడెడ్ పాఠశాలల్లో 12,978మంది చదువుతున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వబడుల్లో 4598 మంది ఉపాధ్యాయులుఉండగా ఎయిడెడ్‌లో 460 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 6700 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లాలో ఈఏడాది ప్రభుత్వపాఠశాలలో చదువతున్న 1,16,430మంది కి జెవికే కిట్లను సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో గతేడాది 17 ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్చారు. జిల్లాలో 21 పాఠశాలలను పిఎంశ్రీ పాఠశాలలుగా మార్చారు. ఈ ఏడాది టెన్తులో జిల్లాలో 72.26 శాతం ఉత్తీర్ణత సాధించారు.

గత ఏడాది ఎయిడెడ్‌పాఠశాలలో భారీ మార్పులు, తరగతుల విలీనం, రేషనలైజేషన్ మార్గదర్శకాల వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల్ని ఒక కిలోమీటరు లోపు హైస్కూల్స్‌లో, అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లోని 6, 7 తరగతుల్ని 3 కిలోమీటర్ల లోపు హైస్కూల్స్‌లో విలీనం చేయడం వల్ల కొంత మంది పాఠశాలలకు రావడానికి కూడా ఇష్టపడలేదు. అలాగేగ్రామాల్లో ఎయిడెడ్ పాఠశాలను అన్ ఎయిడెడ్‌గా మార్చడం వల్ల కూడా ప్రత్యామ్నాయపాఠశాలలు లేక కొంత మంది చదువుకు దూరమయ్యారు.

ఉక్రెయిన్‌లో ఆనకట్ట కూల్చివేత అమానవీయం

ప్రజాశక్తి-గుంటూరు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచాన్ని కూడా అతలాకుతలం చేస్తోందని, రెండు రోజుల క్రితం స్థానికంగా విద్యుత్, సాగు, తాగునీటి అవసరాలకు చాలా ముఖ్యమైన ఉక్రెయిన్‌లోని నోవా కఖోవ్కా ఆనకట్టను కూల్చివేయడం అమానవీయ చర్య అని అవగాహనా సంస్థ ఖండించింది. ప్రపంచంలోనే అత్యధిక జలసామర్థ్యం ఉన్న డ్యామ్‌లలో ఈ ఆనకట్ట ఒకటని, దీనిని కూల్చివేయడంతో నీరు ఊళ్లను ముంచెత్తి వేలమంది, ఇల్లూ వాకిలి పోగొట్టుకున్నారని అన్నారు. యుద్ధం ఎవరిదైనా, అందులో ఎవరి చేయి పైనా కిందా అయినా చివరకు నష్టపోయేది ప్రజలేనని, యుద్ధం సాకుతో సాధారణ పౌరులపై దాడులు, ప్రాథమిక వసతి సౌకర్యాలపై దాడులు ఏరకంగానూ సమర్థనీయం కాదని అన్నారు. ఈ ఆనకట్ట విధ్వంసాన్ని అందరూ నిరసించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేసింది.

అమిత్ షా గోబ్యాక్ ..

నేటి నిరసనను జయప్రదం చేయండి

సిపిఎం, సిపిఐ నాయకుల పిలుపు

ప్రజాశక్తి మంగళగిరి

కేంద్ర మంత్రి అమిత్ షా 11వ తేదీన విశాఖపట్టణంలో పర్యటించడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు ఆదివారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టాలని మంగళగిరిలో సిపిఐ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చంగయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య మాట్లాడుతు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిధులు, రైల్వే జోన్ నిధులు కేటాయించకుండా కేంద్ర మొండిచేయి చూపించిందన్నారు. రాష్ట్ర హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. అమిత్ షా రాష్ట్రంలో పర్యటించడం సరికాదని దేశంలో ప్రజల మధ్య మతకలహాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే చర్యలను కేంద్రం చేపడుతుందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయని మోడీ దత్తపుత్రులైన అదాని అంబానీలకు ఆస్తులన్నీ అమ్మేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం



అవలంబిస్తున్న విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థ మరుగున పడిపోతుందని అన్నారు. విశాఖ ఉక్కును 32 మంది బలిదానాలకోరి సాధించుకుంటే ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. ఈ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని, ఆదివారం అమిత్‌షా విశాఖ పర్యటన సందర్భంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం మంగళగిరి పాత బస్టాండ్ గౌతమ్ బుద్ధ రోడ్డు సర్కిల్ దగ్గర నిరసన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. నిరసనలో సిపిఐ, సిపిఐ (ఎంఎల్) సిపిఎం నాయకులు కార్యకర్తలు, పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్ రావు, హనుమయ్య, సిపిఎం నాయకులు వివి జవహర్లాల్, పిల్లలమర్రి బాలకృష్ణ పాల్గొన్నారు.

కాకుమాను జట్టుకు రూ.లక్ష ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు ఆందోళన పడకూడదని మాజీ హోశాఖ మంత్రి పత్తిపాడు శాసనసభ్యులు మేకతోటి సుచరిత అన్నారు. జడ్పీ పాఠశాలలో గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్న వైఎస్ఆర్ రాష్ట్రస్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల నిర్వహణ కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. సభలో శాసనసభ్యులు సుచరిత, పత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వాలీబాల్ పోటీల నిర్వహణ గౌరవ అధ్యక్షులు షేక్ ఖాసిం పీరా విజేతలకు బహుమతులు అందజేశారు. రూ.లక్ష బహుమతి గెలుచుకున్న కాకుమాను జట్టుకు గోల్డ్ కప్‌ను, ద్వితీయ బహుమతి



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేకతోటి సుచరిత



విజేత కాకుమాను జట్టుకు కప్ప అందజేస్తున్న సుచరిత, తదితరులు

బాపట్లజట్టుకు రూ.50వేల నగదు, కప్పు, తృతీయ బహుమతి గెలుచుకున్న హైదరాబాద్ జట్టుకు రూ.30వేల నగదు, నాలుగవ బహుమతిచెన్నైజట్టుకు, ఐదవ బహుమతి బేతపూడి జట్టకు అందజేశారు. ప్రత్యేక బహుమతులకు కృష్ణా, గుంటూరు బాలికల జట్టుకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సేవ శక్తి వారిని, నిర్వహణ కమిటీని ఎమ్మెల్యే సుచరిత ఘనంగా సత్కరించారు. ఈ పోటీలు విజయవంతనికి సహకరించిన ప్రతి ఒక్కరికి కమిటీ గౌరవాధ్యక్షులు ఖాసింపీరా కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

శాసనసభ ఎన్నికలకు సంవత్సరం గడువు ఉండటంతో తాడేపల్లి పట్టణంలో ప్రధాన రాజకీయ పార్టీలు టిడిపి, వైసిపి సిద్ధమవుతున్నాయి. జనసేన కూడా పొత్తులో భాగంగా మంగళగిరిలో తామే పోటీ చేస్తున్నామని ఇటీవల ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ప్రకటించారు. వామపక్షాలు ముఖ్యంగా సిపిఎం సీట్లు ఓట్లు లెక్క వేసుకోకుండా నిత్యం ప్రజల్లో పని చేస్తుంది. ఇటీవల వైసిపి కార్యాలయంలో గృహ సారధులు, వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఒక్కో గృహ సారధికి 50 ఇళు కేటాయించారు. ఇద్దరు గృహ సారధులతో పాటు వలంటీర్ కూడా వారి వెంట ఉంటారు. ఆయా ఇళ్లకు వెళ్లినప్పుడు వివిధ రకాల ప్రశ్నావలి వెంట తీసుకెళ్తున్నారు. దాదాపు ఆ ప్రశ్నావలిలోనే ఆ కుటుంబం ఎవరికి ఓటు వేస్తారనే ఒక అంచనాకు వస్తారు. తమకు అందిన నివేదిక ప్రకారం తమ పరిధిలో అధికార పార్టీకి ఉన్న ప్లస్‌లు, మైనస్‌లు క్రోడీకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారు. సమాచారాన్ని సిఎం దృష్టికి వెళ్లే విధంగా అధికారులు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు ప్రధానంగా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను వినియోగించు కుంటున్నారు. మరోపక్క తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశాలు నిర్వహిస్తోంది. తాడేపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణంలోని ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నారు. వార్డుల్లో పరిస్థితులపై అంచనా వేస్తున్నారు. కలిసొచ్చే మిత్రులు ఎవరున్నారు, వారు వస్తే ప్రయోజనం ఏమిటి, కలిసి రాకపోతే జరిగే ఇబ్బంది ఏమిటి అనే దానిపై సమీక్ష చేస్తున్నారు. ఎన్నికల వ్యూహ రచనలో భాగంగానే తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలో నారా లోకేష్ పేరుతో ఉచితంగా సంజీవని ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇక్కడ షుగర్ వ్యాధితో పాటు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అన్ని రకాల టెస్టులు నిర్వహించేందుకు ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేశారు. మరో పక్క గత ప్రభుత్వంలో ఉన్న అన్న క్యాంటీన్‌ల పేరుతో ఉచితంగా భోజనం అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో భోజనానికి ఐదు రూపాయలు వసూలు చేసినా ప్రస్తుతం మాత్రం ఉచితంగానే అందిస్తున్నారు. నియోజకవర్గంలో మూడు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్‌లు నడుస్తున్నాయి. వీటితో పాటు రోడ్డు పక్కన చిరువ్యాపారాలు నిర్వహించే వారికి టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు ఇరుపార్టీలు పోటీపడి అందజేస్తున్నాయి. వికలాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్నాయి. ఎవరికైనా చిన్న ప్రమాదం జరిగినా, చనిపోయినా (పేదల పేటల్లో) మట్టి ఖర్చుల కోసం నేరుగా డబ్బులు పంపిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని పార్టీ నాయకత్వానికి స్థానిక నాయకత్వం ద్వారా అర్జీ పెట్టుకుంటే బాధితుల ఆధార్ కార్డు సరి చూసుకుని డబ్బులు అందజేస్తున్నారు.


గత మూడు సంవత్సరాల నుంచి ఎక్కడ పెళ్లి జరిగినా నారా లేకేష్ పెళ్లికానుక పేరుతో నవ వధూవరులకు బట్టలు అందజేస్తున్నారు. ఇన్ని చేసినా ఇరు పార్టీలు ఎన్నికల ముందు రోజు ఓటర్లకు ఎంత డబ్బులు పంపిణీ చేస్తారనే దానిపైనే చర్చ నడుస్తుంది. టిడిపి తరుపున నారా లేకేష్ పోటీ చేస్తారని ఖాయంగా కనిపిస్తుంది. వైసిపి తరుపున ఇప్పటికే రెండు సార్లు గెలిచిన ఆళ్ల రామకష్ణారెడ్డి తప్పకుండా మంగళగిరిలో పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతుంది. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న పద్మశాలీయుల సామాజిక వర్గాన్ని దష్టిలో పెట్టుకుని తనకు నచ్చిన వ్యక్తికి టికెట్ ఇప్పించుకుంటారనే చర్చ నడుస్తుంది. ఆ మేరకు లీకులు కూడా వదులుతున్నారు. గతంలో కూడా ఇలాగే లీకులు వదిలి చివరకు ఆర్‌కె పోటీలో ఉన్న విషయం కూడా ప్రజలకు గుర్తుంది. లోకేష్‌ను ఢీకొట్టాలంటే ఈసారి కూడా వైసిపి తరుపున ఆర్‌కె పోటీ చేస్తారనే వాదన వినపడుతుంది.

ముందస్తు ఎన్నికలు లేవని ఇటీవల సిఎం ప్రకటించినా ఎన్నికలకు సంవత్సర కాలం సమయం ఉన్నా మంగళగిరి నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలు వేగంగా ఓటర్లను తమ వైపు ఎలా తిప్పుకోవాలా అని ముందుకు వెళ్తున్నాయి. మంగళగిరిలో పోటీ ఈ సారీ రసవత్తరంగా మారే అవకాశం కనిపిస్తుంది. ఇటీవల జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు టిడిపి, జనసేన మధ్య పొత్తు ఉంటే మంగళగిరి సీటు తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మీడియా ముందు ప్రకటించారు. ఈ ప్రకటన ఇరుపార్టీల మధ్య ఎటువంటి పరిస్థితులకు దారి తీస్తుందోనని చర్చ నడుస్తుంది. ఇక వామపక్షాలకు పట్టుగొమ్మగా ఉన్న మంగళగిరి ఇటీవల నూతన ఆర్థిక విధానాల పోకడ వల్ల కొంత మార్పు వచ్చింది. అయితే ఇప్పటికీ ఎర్రజెండా, కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే పేదలకు రక్షణ అని బలంగా ఉంది. ఓట్లు, సీట్లు లెక్క లేకుండా నిరంతరం వామపక్షాలు ముఖ్యంగా సిపిఎం ప్రజల్లో పని చేస్తుంది. ఇప్పటికే సిపిఎం ఎన్నికలకు తన శ్రేణులను సిద్ధం చేస్తుంది. ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌తో పాటు ప్రజల నాడిని తెలుసుకునేందుకు సిపిఎం ప్రయత్నిస్తోంది.

నెరవేరనున్న రెండు జిల్లాల ప్రజల కల

- మాదిపాడు-ముత్యాల వద్ద కృష్ణా నదిపై వారధి • 12న ముఖ్యమంత్రి శంకుస్థాపన
- పల్నాడు- ఎన్‌టిఆర్ జిల్లాలను కలుపుతూ నిర్మాణం • మాదిపాడు ప్రజల సంతోషం





ప్రజాశక్తి - అచ్చంపేట

పల్నాడు,ఎన్‌టిఆర్ జిల్లాల ప్రజల ఏళ్ల నాటి కల నెరవేరనుంది. ఈ రెండు జిల్లాలను కలుపుతూ పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ముత్యాల వద్ద కృష్ణ నదిపై వారధి నిర్మాణానికి ఈ నెల 12వ తేదీన ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. రూ.60 కోట్ల వ్యయంతో 600 మీటర్ల పొడవు 12 మీటర్ల వెడల్పుతో వద్ద నదిపై వంతెన నిర్మించేందుకు అంచనాలు కూడా తయారు చేశారు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న తమ కల నెరవేర బోతోందని మాదిపాడు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం పరిధిలో పలు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి పారిశ్రామికంగా కొనసాగుతున్న మండలం ముఖ్యంగా కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ రాజు వంశీయులు కావడంతో వ్యాపార అభివద్ధిలో భాగంగా 80 సంవత్సరాల క్రితం వంతెన నిర్మిస్తామంటూ ఫ్యాక్టరీల యాజమాన్యం ప్రభుత్వాన్ని కోరినట్లుగా సమాచారం. రాజకీయ నేపథ్యంలో ఆచరణకు నోచుకోలేదు అంతేకాకుండా నాగార్జునసాగర్ నిర్మాణ క్రమంలో పులిచింతల ప్రాజెక్టు కృష్ణా నదిపై వారధి నిర్మించాలని గతంలో కొన్ని ప్రయత్నాలు చేసినట్లు మాదిపాడు గ్రామ ప్రజలు చెబుతుంటారు. అంతేకాకుండా సిమెంట్ ఫ్యాక్టరీ కి సిమెంట్ తరలించేందుకు రైలు మార్గం కూడా ఉంది. మాదిపాడుకు అతి చేరువలో ఉన్న జగ్గయ్య పేట అభివృద్ధి చెందుతున్నా నదిపై వంతెన లేకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వైపు మాదిపాడు ప్రజలు అన్ని విధాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యవసర సరుకులు, రైతులు, ఎరువులు, పురుగుమందులు కొందరు జీవనోపాధి కోసం పడవల ద్వారా జగ్గయ్యపేట మండలం నిత్యం వెళుతుంటారు. వర్షాకాలంలో ఉధృతంగా నది ప్రవహిస్తే కొన్ని రోజులపాటు మాదిపాడు ప్రజల అవస్థలు వర్ణనాతీతం. పర్యాటక కేంద్రంగా మాదిపాడు లోని సత్యమ్మ తల్లి దేవాలయం ప్రాజెక్ట్, నది అవతలివాడ్డున యాదాద్రి, పెనుగంచిప్రోలు, కోటిలింగాలు వంటి పుణ్యక్షేత్రాలతో నిత్యం వివిధ మండలాల నుండి యాత్రికులు ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అచ్చంపేట మండలం పుట్లగూడెం, మాదిపాడు గ్రామాల వద్ద బల్లకట్లు కొన్ని రేవు ల వద్ద పడవల సహాయంతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు గతంలో పడవ ప్రమాదాలు కూడా జరిగిన సందర్భంలో ఉన్నాయి చరిత్రలో భాగంగా 18 వ శతాబ్దంలో వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పరిపాలించిన కాలంలో వారి తల్లిదండ్రుల పేరుపై జగ్గయ్య అచ్చ మాంబ పేరుతో జగ్గయ్యపేట అచ్చంపేట మండలాలుగా నేడు కొనసాగుతున్నాయి. రూ. 60 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నదిపై వంతెన నిర్మాణాలకు అంచనా వేసింది 14 ఎకరాల సేకరించి 600 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, 14 పిల్లర్లతో వంతెన నిర్మాణానికి ఊహ చిత్రాన్ని కూడా తయారు చేశారు. వారధి నిర్మాణం చేస్తే మాదిపాడు మీదుగా జగ్గయ్యపేట, నల్గొండ హైదరాబాద్‌కు ప్రయాణం కొనసాగించవచ్చు. అదేవిధంగా సత్తెనపల్లి,నరసరావుపేట మీదుగా చెన్నైకి వెళ్ళవచ్చు. 70 కిలోమీటర్ల మేర ప్రయాణం, ప్రయాణికులకు టోల్‌గేట్‌ల భారం కూడా తగ్గుతుంది. తమ కష్టాలు నెరవేర బోతున్నాయంటూ మాదిపాడు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

ప్రజాశక్తి-తెనాలి

పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటనపై పట్టణ త్రీ టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాండురంగపేటకు చెందిన గరికపాటి సరిత ఈ నెల 8న అదృశ్యమైంది. ఆమె 14 ఏళ్ళ కుమార్డు గణేష్, 12ఏళ్ళ కుమార్తె దీక్షతను కూడా ఆమెతో పాటే తీసుకువెళ్ళింది. గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికలోడు లారీకి జరిమానా

ప్రజాశక్తి-తెనాలి


అధికలోడుతో వెళుతున్న ఇసుక లారీకి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అపరాద రుసుం విధించారు. ఇన్‌స్పెక్టర్ ఏవి చలం వెల్లడించిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం బొమ్మువాని పాలెం వద్ద శనివారం నిఘా ఉంచిన ఎస్‌ఈబి అధికారులు పరిమితికి మించిన లోడుతో వెళుతున్న లారీని గుర్తించారు. లారీ యజమానికి రూ.22వేలు జరిమానా విధించారు.

ఈతకు వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

కృష్ణానదిలో సరదాగా నలుగురు విద్యార్థులతో కలిసి ఈతకు దిగిన ఇంజనీరింగ్ విద్యార్థి మృతిచెందిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న తిరుమలశెట్టి అజయ్ కుమార్ (22), అతని స్నేహితులు ఎస్‌కె దరియావలి, ఎస్‌కె వసీం, వి.ప్రవీణ్ సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద నదిలోకి దిగారు.





మృతుడు అజయ్ (ఫైల్)

ముందుగా అజయ్‌కుమార్, ప్రవీణ్ నదిలోకి దిగారు. అజయ్ కుమార్ మునిగిపోతుండగా కాపాడటానికి ప్రవీణ్ ప్రయత్నం చేశాడు. ఇద్దరు మునిగిపోతున్నారని దరియావలి, వసీం పెద్దగా కేకలు వేశారు. పక్కనే ఉన్న పల్లెకారులు ప్రవీణ్‌ను రక్షించగలిగారు. అజయ్‌కుమార్ అప్పటికే నీటిలో మునిగి చనిపోయాడు. మృత దేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం మంగళగిరి ఆసుపత్రికి తరలించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కృష్ణా జిల్లా విజయవాడ సమీపంలోని కానూరుకు చెందిన వ్యక్తి.

జంగంగుంట్ల పాలెంలో చోరీ

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని జంగంగుంట్ల పాలెం లో రెండు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున వెలుగు చూసింది. లింగంగుంట్ల పాలెం గ్రామానికి చెందిన కుళ్ళి శివారెడ్డి ,కొల్లి వెంకట కష్ణారెడ్డి ఇరువురు అన్నదమ్ములు. కుటుంబ సభ్యులతో కలిసి ఇరు కుటుంబాలు వారం రోజుల క్రితం షిరిడి యాత్రకు వెళ్లారు. భద్ర ముగించుకొని శనివారం తెల్లవారుజామున స్వగ్రామానికి చేరారు. తలుపులు తీసి లోపలికి వెళ్లేసరికి ఇంటిలోని వస్తువులు చల్లా, చెదురుగా పడి ఉన్నాయి. రెండు ఇళ్లల్లోని బీరువాలు తాళాలు పగలగొట్టి డోర్లు తెరిచి ఉండడాన్ని గమనించారు. దొంగతనం జరిగిందని భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు ఇళ్లల్లో వారు రూ 4 నగదు, ఐదు లక్షల రూపాయలు విలువ చేసే బంగారం, కేజీ వెండి, వేల రూపాయలు విలువచేసే ఖరీదు కలిగిన పట్టుచీరలు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. ఏడుకొండలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు పూరి జరిగిన రెండేళ్ల వద్దకు వచ్చి ఆధారాలు సేకరించారు.



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఆచార్య ఎన్‌జి రంగాకు 'అవగాహన' నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయోద్యమ నాయకుడు, దేశ క్షేమాన్ని, ప్రత్యేంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసిన ఆచార్య ఎన్‌జి రంగా దేశ ప్రజల హృదయాలో ఎప్పటికీ నిలిచి పోతారని అవగాహన సంస్థ పేర్కొంది. స్థానిక అరండల్‌పేటలో సంస్థ కార్యాలయంలో రంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన నాయకుడు రంగా అని కొనియాడారు. 1930 నుండి 1991 వరకు ఆరు దశాబ్దాలకు పైగా ఉత్తమ పార్లమెంట్ సభ్యునిగా అందరి ప్రశంసలు ఆయన అందుకున్నారని ప్రశంసించారు.

రైతుల భాగస్వామ్యం లేకుండా ఏ ఉద్యమం విజయవంతం కాదని తేల్చి చెప్పిన రంగా, తాను నమ్మిన సిద్ధాంతాల విషయంలో ఎప్పుడూ రాజీపడ లేదని అన్నారు. ఉత్తమ రైతు పురస్కార గ్రహీత భండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ రంగా ఏనాడూ పదవులు ఆశించలేదని అన్నారు. భారత రాజకీయ క్షేత్రంలో 'రైతు రంగా'గా దేశప్రజల హృదయాల్లో తన స్థానాన్ని పదిలంగా ఉంచుకున్న గొప్ప వ్యక్తి రంగా అని కొనియాడారు.



సరోజినిని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

ఎపిఆర్‌జెసి నూతన ప్రిన్సిపాల్ గా ఎన్. సరోజిని

ప్రజాశక్తి-విజయపురిసౌత్

నాగార్జునసాగర్ విజయపురిసౌత్ లోని స్థానిక ఎపి ఆర్‌జెసి నూతన ప్రిన్సిపాల్ గా నూతక్కి సరోజినీ శని వారం విద్యార్థుల బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎ. వేణుగోపాలరావు కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగారు. ఇప్పటివరకు కళాశాల ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహించిన తనకు సహకరించిన కళాశాల లెక్చరర్లకు, అలాగే సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సరోజినీకి పూర్తి సహకారాలు అందించాలని కోరారు. అనంతరం నూతన ప్రిన్సిపాల్‌ని పూర్వ ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, పుల్లయ్య, లాల్ బహుదూర్, టి.రాజశేఖర్,జి.హను మంత రావు, చెన్నా వెంకటేష్, గోపయ్య, శరత్ బాబు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి -రెంటచింతల



గత ఏప్రిల్ 30న శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో 222 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ నిర్వహించారు. వారందరికి శనివారం ఉచితంగా కళ్లజోళ్ళను అందజేశారు. ఈ సందర్భంగా స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో వైఆర్ ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ ఏచూరి సైదయ్య, డాక్టర్ సోనాలి, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ ఆకాంక్ష ,క్యాంపు నిర్వాహకులు ఎన్. పెదబాబు, జి.జనార్ధన్ రావు, వై. వెంకట సైదయ్య,రవి, రాజేషు, సత్యనారాయణ , కాశీ రామారావు ,సుబ్బారావు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- నూజెండ్ల

స్వతంత్రం వచ్చి 70 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోదా జాన్ పాల్ అన్నారు. మండలంలోని రవ్వారం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జాన్ పాల్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ పాల్ మాట్లాడుతూ ఇప్పటికైనా రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు వాటిపై దృష్టి పెట్టి ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. దళితులను అబివృద్ధి పథంలో నడిపించడంలో ముందున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం ఈ నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లిన రోడ్లు, మౌలిక వసతులు లేవని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాల మహానాడు పార్లమెంటు అధ్యక్షులు కొండ్రు విజయ్, వినుకొండ ఇన్‌ఛార్జి కీర్తిపాటి వెంకటేశ్వర్లు, వర్కింగ్ అధ్యక్షులు గుడిపూడి ఏసురత్నం, గౌరవాధ్యక్షులు కపయ్య, మండల అధ్యక్షులు గురుమూర్తి, యూత్ అధ్యక్షులు బోయిన ఆశీర్వాదం ,ఉపాధ్యక్షులు మాలపాటి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా?

- పట్టణాల్లో పూర్తి కాని జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ
- ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు కూడా
- గ్రామాల్లోని పేదల పరిస్థితి ప్రశ్నార్థకమేనా?

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇంతవరకూ పట్టణాల్లోని జగనన్న ఇళ్లకు సంబంధించిన పట్టాల పంపిణీ పూర్తిగా జరగలేదు. ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణమూ పూర్తికాలేదు. ఇంకా గ్రామాల్లోని పేదలకు సొంతింటి కల.. కలగానే మిగిలిపోతుందేమోననే విమర్శలు వినిపిస్తున్నాయి. 2021లో పట్టణంలో జగనన్న ఇళ్ల నిర్మాణానికి పేదలకు 125.57 ఎకరాల విస్తీర్ణం (పట్టణంలో కలిపిన మానుకొండువారిపాలెం, పసుమర్రు గ్రామాలతో సహా) మొత్తం పసుమర్రు పరిధిలో 4 లే అవుట్లతో 7864 ప్లాట్లు గాను, రెండోవది గుదేవారిపా లెం గ్రామ పంచాయతి పరిధిలో 60.00 ఎకరాలలో రెం డు లే అవుట్లతో 300 ల ప్లాట్స్ తో వెరసి మొత్తం 185.57 ఎకరాలలో 8254 మందికి ప్లాటులు వేశారు. అందులో పట్టణ పేదలకు 7865 గాను 7265 పట్టాలు ఇచ్చారు. పసుమర్రు,మానుకొందువారి పాలెం రెండు గ్రామాలకు కలిపి 300 పటాలకు గాను 204 పట్టాలు ఇచ్చారు. ఇదే పూర్తి గాక అధికారులు తలపు పట్టు కుం టుంటే ఇంకా పల్లె వాసుల సంగతేమిటి. మండల పరిధిలో ని 19 గ్రామాలలో జగనన్న ఇళ్ల నిర్మాణానికి గాను అన్ని గ్రామాలు కలపు కుని 28.25 ఎకరా ల్లో 19 లే అవుట్లతో ఒకొక్కక్కరికి సెంటున్నర చొప్పున 1051 ప్లాట్స్ వేసి అందులో 886 ప్లాట్ల ను పేదల కు పంపిణీ చేశారు. ఇంకా165 ప్లాటులను పంచా ల్సి ఉంది. అంత వరకు బా గానే ఉంది. ఒక్క గ్రామంలో కూ డా ఇంత వరకు జగనన్న ఇళ్లను నిర్మిం చే ప్రయత్నాలు ఏ మాత్రం చేపట్ట లేదు.

పట్టణాల్లో ఇచ్చిన స్థలాల్లో ఇంత వరకు ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని , ఎప్పటికి పూర్తవుతాయోనని పట్టాలు పొందిన పేదలు అనుకుంటున్నారు. యడ్లపాడు మండల పరిధిలోని 28 గ్రామాల్లో 28 లే అవుట్ల తో 59.655 ఎకరాల్లో సెంటున్నర చొప్పున మొత్తం 2191 ప్లాట్లు వేసి, వాటిల్లో 1564 మందికి ప్లాట్స్ ఇవ్వగా, ఇంకా 627 ప్లాట్స్ ఇవ్వాల్సి ఉంది. నాదెండ్ల మండలంలో 24 లే అవుట్లతో 73.035 ఎకరాల్లో 2,677 ప్లాట్స్ వేసి 2,530 ప్లాట్స్ ఇచ్చామని, ఇంకా 147 ప్లాట్లు ఇవ్వాలని మున్సిపల్, తహశీల్దార్, హౌసింగ్ బోర్డ్ ఉన్నతాధికారుల చెబుతున్నారు. పల్లెల్లో ఇచ్చిన స్థలాల్లో ఎప్పటికి ఇళ్లు పూర్తవుతాయో తెలియక పట్టాదారులు తలలు పట్టుకుంటు న్నారు.ఎనిమిది నెలల క్రితమే రెండో దశ కింద రాష్ట్రం మొత్తం పట్టణాల్లో సుమారు మూడు లక్షల ఇళ్ల నిర్మాణాలు ప్రారం భించారు.



చిలకలూరిపేట మండలం రామచంద్రాపురంలోని ప్లాట్లు

దిడుగులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధిలోని దిడుగులో వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, పెదకూరపాడు నియోజకవర్గ టిడిపి నాయకులు వట్టికుంట శేషగిరిరావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. హిందూపురం శాసన సభ్యులు, సినీ నటుడు నందమూరి. బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బిపి, షుగర్, గ్యాస్, నరాల బల హీనత, ఎముకల సమస్యలతో అనేకమంది పేదలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడ్లమూడి హాస్పిటల్ వైద్యులు వడ్లమూడి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలందరికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో తమ ట్రస్ట్ పని చేస్తుందని చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో మేఘ వైద్య శిబిరం నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందిస్తూ మందులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పేద ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.



సైకిల్ పై వింత రీతిలో సవారి

ప్రజాశక్తి-నరసరావుపేట



'సాధనమున సమకూరు పనులు ఇలలోనా....' అనే సామెత పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన నాగూర్ బాషాకు వర్తిస్తుంది. సైకిల్ పై వింత రీతిలో సవారి చేస్తూ 'ఔరా!' అనిపిస్తున్నాడు. యువత సాధన చేస్తే ఏదైనా సాదించవచ్చని నిరూపిస్తున్నాడు. స్థానిక మున్సిపల్ బాలుర హైస్కూల్ లో నాగూర్ బాషా 9వ తర గతి చదువుతున్నాడు. రెండు కాళ్లతో సైకిల్ నిలుచుని, ఎంత దూరమైన సమతౌల్యంగా వెళతా అంటు న్నాడు. మొదటి నుండి ఇలాంటివి చేయడం అంటే తనకు ఎంతో ఇష్టమని, ఇలా సవారి నేర్చుకునేందుకు 4 నెలల పాటు సాధన చేసినట్లు చెప్పాడు.

సంక్షేమం కన్నా ఛార్జీల భారం అధికం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఛార్జీలను ఇబ్బడి ముబ్బడిగా పెంచేస్తున్నారని టిడిపి పశ్చిమ నియోకవర్గం ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర నాని విమర్శించారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ సరఫరా సరిగా లేకుండా, ఛార్జీలనుభారీగా పెంచుతూ ఎప్పుడో వినియోగించుకున్న యూనిట్లకు ఇప్పుడు ఛార్జీలను వసూలు చేయడం దారుణం అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా వచ్చే లబ్ధి కన్నా విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల భారం అధికంగాఉందన్నారు. గత నాలుగేళ్లలో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. విద్యుత్ వాడకం తగ్గినా ఛార్జీల భారం తగ్గడంలేదన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, నాయకులు లాల్ వజీర్, దాసరి జ్యోతి, వల్లంశెట్టి వీరయ్య, ఉప్పుటూరి పేరయ్య పాల్గొన్నారు.

చిలకలూరిపేట: వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రంలో విద్యుత్ రంగం నిర్వీర్యమైందని, విద్యుత్ కోతలతో ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. స్థానిక పండరిపురం లోని తన నివాసంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జగన్ అధికారం లోకి వచ్చాక పలు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని చెప్పారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. **సత్తెనపల్లిరూరల్:** విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్రాన్ని ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అధోగతి పాలు చేశారని మాజీ మంత్రి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. సత్తెనపల్లి లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అవినాష్ రెడ్డికి చెందిన షిరిడి సాయి కంపెనీకి స్మార్ట్ మీటర్ల పంపిణీ బాధ్యత అప్పగించటాన్ని తప్పు బట్టారు. షిరిడి సాయి కంపెనీ నాసిరకం సామాన్లు సరఫరా చేయటం వల్లనే విద్యుత్ రంగంలో నష్టాలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కరెంట్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారని, ఒక గంట కూడా ముఖ్యమంత్రి గా ఉండేందుకు జగన్‌కి అర్హత లేదని వ్యాఖ్యానించారు. **పొన్నూరు రూరల్:** విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై అధిక భారాన్ని మోపుతోందని వైసిపి ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు, కస్టమర్ చార్జీల పేరుతో ప్రజల నుండి అధికంగా చార్జీలను వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వ విధానాలను పక్క రాష్ట్రాల వ్యతిరేకించినప్పటికీ జగన్మోహన్ రెడ్డి మాత్రం తనపై ఉన్న కేసుల భయంతో కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, పొన్నూరు నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న టిడిపి నేత కోవెలమూడి రవీంద్ర

కౌలు రైతు చట్టాన్ని సవరించాల్సిందే..

- కౌలురైతు సంఘం రాష్ట్ర జాతా డిమాండ్
- పెదకాకాని, దుగ్గిరాల మండలాల్లో పర్యటన
- ఘన స్వాగతం పలికి, జాతాకు సమస్యలు తెలిపిన కౌలు రైతులు
- 12న పాదయాత్ర, సిసిఎల్ఏ కార్యాలయానికి రాయబారం
- జయప్రదం చేయాలని నాయకుల పిలుపు


నంబూరు ప్రచార సభలో మాట్లాడుతున్న వై రాధాకృష్ణ

ప్రజాశక్తి -మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి రూరల్

2019 కౌలు రైతు చట్టాన్ని సవరించాలని, చట్టంలో కీలకంగా మారిన భూ యజమాని సంతకం నిబంధన తొలగించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కొట్టిపాలెంలో ప్రారంభమైన జాత శనివారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు, దుగ్గిరాల మండలం చిలువూరు, తుమ్మపూడి, దుగ్గిరాల, తెనాలి రూరల్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను జాతా బృంద నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో రాధాకృష్ణ ప్రసంగించారు. రాష్ట్ర వ్యాపితంగా రెండు జాతాలు కౌలు రైతుల సమస్యలు తెలుసుకుంటానికి పర్యటిస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నవారికి బియ్యం అందుతున్నాయి, ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే వైద్య సేవలు పొందవచ్చు. కానీ సాగు చేసి అన్నం పెట్టే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్లో నూటికి 70 మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. వారికి కనీసం గుర్తింపు కార్డు ఇవ్వడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అనేక ఇబ్బందులు పెడుతుందని విమర్శించారు.

వ్యవసాయం గిట్టుబాటు కావటం లేదని భూ యజమానులు ప్రత్యామ్నయం ఎంచుకున్నారన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి సామాజిక తరగతులు భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారన్నారు. భూ యజమానులు కౌలు కార్డులు ఇవ్వడానికి సంతకం పెట్టడానికి కూడా ముందుకు రావడంలేదని అన్నారు. యజమాని సంతకంతో పని లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో గ్రామ సభల ద్వారా కైలు రైతులను గుర్తించి గతంలో ఇచ్చేవారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూ యజమానితో ఒప్పందం చేసుకోవాలని నిబంధనల వలన గుర్తింపు కార్డులు రావడంలేదని విమర్శించారు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


దుగ్గిరాలలో మాట్లాడుతున్న ఎన్ యోగేశ్వరరావు

లక్షలాది ఎకరాల్లో పంట నష్టపోతే ఇప్పటివరకు ఒక్కరికి కూడా నష్టపరిహారం అందలేద న్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదని విమర్శించారు. నాలుగు సంవత్సరాలు ఎంతమందికి గుర్తింపు కార్డు ఇచ్చారని ప్రశ్నించారు. కౌ లు రైతులను సమీకరించి న్యాయం కోసం పోరాడి చట్టంలో మార్పులు తీసుకొస్తా మన్నారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు నుండి పాదయాత్ర జరిపి భూ పరిపాలన కమిషనర్తో చర్చించి కౌలు రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటలకు మద్దతు ధర కన్నా ఎక్కువ ఇచ్చి రైతులను ఆదుకుంటుందని అన్నారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేయడమే తమ ధ్యేయంగా పనిచేస్తుందని విమర్శించారు.


దుగ్గిరాలలో సమస్యలు తెలుసుకుంటున్న జాతా నాయకులు

ఈనెల 12న మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయం వరకు జరిగే పాదయాత్రలో కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర జాతాకు తెనాలి ఐతానగర్ ఎర్రబడి వద్ద ప్రచార జాతకు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ప్రసంగించారు. సరళీకృత ఆర్థిక విధానాల వలన వ్యవసాయం నష్టాల సాగుతో నడుస్తుందన్నారు. అందులో ముఖ్యంగా కౌలు రైతుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందక, కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి ఇక్కట్లు పాలవుతున్నారన్నారు. కౌలు రైతు కష్టాలు తీరాలంటే కౌలు చట్టాల్లో ప్రభుత్వం సవరణ తీసుకురావాల్సిందేనన్నారు. భూ యజమాని సంతకం అనే నిబంధనను తొలగించి కౌలు రైతు కార్డులు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.

నంబూరు జాతాలో రాష్ట్ర నాయకులు గంట లక్ష్మీపతి, సిఐటియు నాయకులు నన్నపనేని శివాజీ, నంబూరు గ్రామ సిపిఎం కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, కౌల్ రైతు సంఘం నాయకులు ఏ వెంకటరెడ్డి, జే అప్పి రెడ్డి, పెదకాకాని గ్రామ నాయకులు బి శివయ్య, ఎస్ నీలాంబరం, కే సత్యనారాయణ, బి సాంబయ్య, కే రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో ప్రచార రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, ఎన్ యోగేశ్వరరావు, ముద్దన సాంబశివరావు, జి బాలచంద్రుడు, డి నాగేశ్వరావు ,మక్కిన కోటేశ్వరావు, కే భిక్షాలు, వై బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

బిల్డింగ్ వర్కర్ల క్లైమ్స్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా రావాల్సిన క్లైమ్స్ను విడుదల చేయాలని, సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని, భవన నిర్మాణ నగర నాయకులు తాడిబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుద్దపల్లి డొంక, బాలాజీనగర్ సెంటర్ అడ్డాలలో భవన నిర్మాణ కార్మికులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి భవన నిర్మాణ కార్మికులకు బోర్డు నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు నిలిపివేసి, ఆ నగదును ఇతర అవసరాలకు మళ్లిస్తుందని విమర్శించారు. సంక్షేమ బోర్డును కొనసాగించాలని, సిమెంట్, ఇనుము, కంకర మొదలైన మెటీరియల్ను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమస్యలపై త్వరలో ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నామని, భవిష్యత్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నగర తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, తాపీ మేస్త్రీలు ముత్యాలరావు, తుమ్మల నాగరాజు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నేడు పదో తరగతి విద్యార్థులకు

మాస్టర్మైండ్స్ ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 10వ తరగతి చదివి ఏప్రిల్ 2023లో జరిగిన పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నేడు సాయంత్రం 5 గంటలకు బ్రాడీ పేట 3/7 లోని పవన్ పుత్ర క్యాంపస్లో ప్రతిభా పురస్కారాలు అందచేయ నున్నట్లు మాస్టర్మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు వారి గుర్తింపు కార్డు, 10వ తరగతి పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితా తీసుకొని రావాలన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం 92487 22218, 8978180847 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సర్టిఫికెట్లతో పాటు, నగదు బహుమతి కూడా ఇవ్వనున్నట్లు మోహన్ తెలిపారు.

టింబర్ ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచాలి


కార్మికులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు : టింబర్ ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని ముఠా కార్మికుల యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక మస్తాన్ దర్గా సెంటర్లోని కలప అడితిలో శనివారం ఎగుమతి-దిగుమతి చేసే ముఠా కార్మికులకు జనరల్బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షులు జిలానీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఠా కార్మికుల కూలి రేట్లు ఒప్పందం ఏప్రిల్ 2023తో ముగిసిందని, నూతన కూలిరేట్లు అగ్రిమెంట్ చేయాలని యాజమాన్యాల సంఘానికి మే నెలలో వినతిపత్రం ఇచ్చామని, కానీ యాజమాన్యం వైపు నుంచి కూలి రేట్ల పెంపునకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటం అన్యాయమన్నారు. ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని, ముఠా కార్మికుల కూలి రేట్ల ఒప్పందం పూర్తి అయ్యి నెలలు గడుస్తున్నా కూలి రేట్లు పెంచకపోవటం అన్యామయని అన్నారు. ఇప్పటికైనా యజమానులు ఆలోచించి నూతన కూలి రేట్లు పెంచే విధంగా అధ్యక్షులు చొరవ చూపాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మేస్త్రీ, హుస్సేన్ మేస్త్రీ, టింబర్ ముఠా కార్మికులు పాల్గొన్నారు.

సిపిఎం సభ్యులు రాఘవులు మృతికి నివాళి


రాఘవులు భౌతిక ఖాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు : బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం అక్కివారిపాలెం గ్రామ సిపియం సీనియర్ సభ్యులు జి.రాఘవులు మృతికి సిపియం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. శనివారం నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్లో రాఘవులు భౌతిక ఖాయాన్ని సిపియం నాయకులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాఘవులు మరణం గ్రామ ఉద్యమానికి తీరని లోటని అన్నారు. రాఘవులు ఆ ప్రాంతంలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని, ఆయన కుమారుడు సుధాకర్ బాపట్ల జిల్లా కమిటీ పరిధిలో పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తున్నారని తెలియజేశారు. రాఘవులు కుటుంబ సభ్యులంతా ప్రజాతంత్ర ఉద్యమంలో ఉన్నారన్నారు. రాఘవులు భౌతిక ఖాయానికి నివాళులర్పించిన వారిలో సిపియం గుంటూరు నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, నగర నాయకులు కె.శ్రీనివాస్, ఖాసింవలి, రమణ, శ్రీదేవి, పద్మ తదితరులున్నారు.

సిఐటియు సంతాపం.. :అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించిన జి.రాఘువులు మృతికి సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజి శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రాఘవులు భట్టిప్రోలు ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు.ఃన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



విజయ్ హెల్త్కేర్, బిసి సంక్షేమ సంఘం వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి కాలనీకి చెందిన రమణ ,గత 10 సంవత్సరాలుగ 2 చెవులు వినికిడి పూర్తిగా తగ్గి పుట్టిడు చెవుడుతో చెవిటి మిషన్ ఆధారం తో కూలీ పని చేస్తూ జీవిస్తోంది. భర్త నారాయణకు మూర్ఛ రోగం ఉండడంతో కుటుంబ భారం మొత్తం రమణ మీదనే పడినది. తాపీ పని చేసే ఈమెకు విద్యుత్ షాక్తో కిందపడి భుజం విరిగి పని చేసుకోవడానికి ఇబ్బందిగా మారింది. దానితో చెవిటి మిషన్కూడా పగిలిపోవడంతో ఎవ్వరూ పని ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం విజయ్ కేర్ ట్రస్ట్కి తెలియడంతో శనివారం బిసి సంక్షేమ సంఘం సహకారంతో రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు, కొత్త వినికిడి మిషన్ అందజేశారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం ఇసి సభ్యులు కె శివరాం బాబాజి, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, విజయహెల్త్కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి, నియోజకవర్గ అధ్యక్షులు ఉడతా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్,మంగళగిరి పట్టణ అధ్యక్షులు బిట్ర ఈశ్వరి, విజయ హెల్త్కేర్ట్రస్ట్ సభ్యులు బొడ్డేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- పటిష్ట బందోబస్తు : ఎస్పీ
- ఎవరూ ఇబ్బంది పడకూడదు: కలెక్టర్
- టెంట్లు, మంచినీరు, మజ్జిగ తదితర అంశాలపై సమీక్ష

ప్రజాశక్తి-నరసరావుపేట/క్రోసూరు

జగనన్న విద్యా దీవెన, కానుక ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న ముఖ్యమంత్రి జగన్ పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు మండలానికి వస్తున్న నేపథ్యంలో ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శివశంకర్ శనివారం క్షేత్ర స్థాయిలో పర్యటించి భద్రత, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఎపి మోడల్ స్కూల్ ప్రాంగణం వద్ద నిర్మించనున్న సభా వేదిక, హెలిప్యాడ్ ప్రాంతం, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్ల కోసం పోలీస్ అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు.ఆయా ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోకుండా తగినంతమంది ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని నియమించి, ఎక్కడికక్కడ ట్రాఫిక్ మళ్లించడం,రాకపోకలకు అనువైన మార్గాలను సూచించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎక్కడికక్కడ ప్రత్యేక బలగాలు, బి.డి పోలీస్ సహాయంతో ముమ్మర తనిఖీలు చేపట్టాలని, తగినంతమంది సిబ్బందిచే బందోబస్తు నిర్వహించాలని సూచించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా నీడ, తాగునీరు , మజ్జిగ,ఆహారం తదితర ఏర్పాట్లలో లోటు ఉండొద్దని, ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులు ఎవరు ఇబ్బంది పడకూడదని, ఆ దిశగా చర్య లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి పర్యటన కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ తలశీల రఘురాం, పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్రరాజు, సత్తెనపల్లి డి.ఎస్.పి ఆదినారాయణ పాల్గొన్నారు.


సీఎం పర్యటన నేపథ్యంలో క్రోసూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



క్రోసూరు బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అచ్చంపేట

ఈ నెల 12వ తేదీన క్రోసూరులో జరిగే బహిరంగ సభకు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి హాజరుకానున్నారని ఆ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు కోరారు. శనివారం అచ్చంపేట మండలం,గ్రామాలలో వైసిపి అభిమానులు,కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు, మాదిపాడు కృష్ణా నది వద్ద వంతెన నిర్మాణానికి ,అమరావతి కోసూరు బెల్లంకొండ రెండు లైన్ల రహదారికి శంకుస్థాపన కార్యక్రమాలు జరగనున్నట్లు చెప్పారు.మండల పరిధిలోని కోనూరులో గుండెపోటుతో మృతి చెందిన వైసిపి కార్యకర్త కె.సాంబయ్య భౌతికకాయాన్ని ఎమ్మెల్యే సం దర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.


గడపగడపకు దగా ప్రభుత్వం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

'నమ్మి గద్దెనెక్కించిన బహుజనులపై దాడులు'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని నమ్మి గద్దెనెక్కించిన దళిత, బహుజనుల పైనే పాశాచిక దాడులకు తెగబడుతూ వారికి భవిష్యత్తు లేకుండా బానిస త్వం లోకి నెట్టివేస్తున్నారని జై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్ ఆరోపించారు. జై భీమ్ భారత్ పార్టీ రూపొందించిన గడపగడపకు దగా ప్రభుత్వం పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని సీనియర్ న్యాయవాది అనుమోలు జయరామ్ కార్యాలయంలో న్యాయవాదుల సమక్షంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్ మాట్లాడుతూ బహుజనులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగకుండా 27 ఎస్సీ పథకాలను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కోవిడ్ సమయంలో మాస్కు అడిగిన డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచి ప్రారంభమైన దమనకాండ కిరణ్ కుమార్, శిరోమండలం, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య చేసి డోర్ డెలివరీ, కడపలో డాక్టర్ అచ్చయ్య మొన్న ప్రకాశం జిల్లా లో మహిళా హనుమాయమ్మ హత్య వరకు వరసగా పాశవిక దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు జై భీమ్ భారత. పార్టీ అధినేత జడ శ్రావణ్ కుమార్ బాధితుల పక్షాన నిలబడుతూ పోరాటం చేస్తూ ప్రజల్ని చైతన్య వంతులను చేస్తున్నారని తెలిపారు. బహుజనులు ఒక్కసారి ఆలోచించండి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బాపయ్య చౌదరి, బి.ఎల్.చిన్నయ్య, పూజల వెంకట కోటయ్య, బత్తిన శ్రీనివాస్ బాబు, దివ్వెల శ్రీనివాసరావు, నరిశెటి వేణుగోపాల్ గంగూరి అజయ్ కుమార్, షేక్. జానీ ఖాజావలి, బక్కా సంగీతారావు, వెంకటేశ్వర్లు, భరత్ పవన్ కుమార్ పార్టీ మండల అధ్యక్షుడు మాతంగి సుధాకర్ రావు, జడ కమల్ కుమార్, మాలపాటి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

- సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- జులై లోపు పరిష్కరించండి
- అఖిలపక్ష సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-నరసరావుపేట

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు దశలవారిగా పోరాటాలు చేస్తామని అఖిలపక్షం నాయకులు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శనివారం అగ్రిగోల్డ్ బాధితులు,ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని రాజకీయ పార్టీలతో కలిపి అఖిల పక్షబేటి నిర్వహించారు.నరసరావుపేట సిపిఐ పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ఏళ్ల తరబడి అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నిలబడి పోరాటం చేస్తున్న సిపిఐ నాయకులకు టిడిపి మద్దతు ఉంటుందని తెలిపారు. టిడిపి హయాంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న జగన్ రెడ్డి అడ్డగించారని ఆరోపించారు. 93 లక్షల మంది సామాన్య,మధ్యతరగతి కుటుంబాలు దాచుకున్న అగ్రిగోల్డ్ ప్రీమియం రూ ,3080 కోట్లు తిరిగి చెల్లించడం ప్రభుత్వానికి పెద్ద విషయం కాదని, వెంటనే బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

జూలై లోపు బాధితులకు చెల్లించాల్సిన రూ.3,080 కోట్లు చెల్లించాలని లేనిపక్షంలో ఆగస్టు నెల నుండి రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. ఎన్నికల అజెండాలో భాగంగా అమరావతిలో రైతులకు ఇళ్ల స్థలాలు పంపిణీ పేరుతో రైతుల పొలాలను అనైతికంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఆగమేఘాల మీద వారం రోజుల్లో రోడ్లు ప్లాట్లు వేసి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని అగ్రిగోల్డ్ బాధితుల సమస్య అంతకంటే తీవ్రమైందని వీరిపై ఎందుకు ప్రభుత్వానికి దయ కలగడం లేదని ప్రశ్నించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రభుత్వంపై అగ్రిగోల్డ్ బాధితులు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతారని అన్నారు. సమావేశలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ నరసరావుపేట కాంగ్రెస్ ఇన్-ఛార్జ్ అలెగ్జాండర్, నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం,సిపిఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు,శ్రీకష్ణ చైతన్య విద్యాసంస్థల అధినేత కొల్లి బ్రహ్మయ్య,పట్టణ మాజీ కౌన్సిలర్ కొర్నెపాటి సంజీవ్ రావు, అసోసియేషన్ నాయకులు బివి చంద్రశేఖర్ అగస్టీన్, మధుసూదనరావు, సైదావలి, కరిముల్లా, అంజలీదేవి, చంద్రయ్య, కోటేశ్వరరావు, పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పక్కన ముప్పాళ్ల నాగేశ్వరరావు, అఖిలపక్షం నాయకులు

మంచికల్లు పశువైద్యాధికారిగా నాగార్జున

ప్రజాశక్తి-రెంటచింతల

మండలంలోని మంచికల్లు పశువైద్యాధికారిగా డాక్టర్ నాగార్జున దీపక్ని నియమించారు. ఈయన నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి దాకా ఈ పోస్టు ఖాళీగానే ఉంది. ఔట్ సోర్సింగ్ సిబ్బంది పశువులకు వైద్యం అందించేవారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రెంటచింతల

ప్రధానమంత్రి సురక్షిత్ మాతత్వ అభియాన్ పథకం కింద స్థానిక పీహెచ్సీలో 82 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ కష్ణారెడ్డి చెప్పారు: వారికి కాల్షియం, ఐరన్ టాబ్లెట్లతో పాటు ఇతర ఇంజన్లను ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమ,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొట్టి మోటార్ సైకిల్ రైడర్ మృతి

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండలంలోని నుదురుపాడు గ్రామానికి చెందిన మక్కెన వేణు(29) తాపీ మేస్త్రి గా పనిచేసే జీవిస్తున్నాడు, అతనికి భార్య, ఒక ఏడాది వయసు గల పిల్లవాడు ఉన్నారు. ఈ నెల 7వ తేదీ రాత్రి 8 గంటలకు నరసరావుపేటలో తాపీ పని ముగించుకుని బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా మేరికపూడిలోని స్పిన్నింగ్ మిల్ క్రాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి గుంటూరు వైపు నుండి వస్తున్న లారీ వేణు బైకును ఢీకొట్టింది. కిందపడిపోయిన అతని తల మీదగా లారీ వెళ్లడంతో అతని తల చిద్రమై మెదడు బయటికి వచ్చి అక్కడికక్కడే చనిపోయాడు. భార్య మక్కెన దివ్య కుమారి ఇచ్చిన రిపోర్టు మేరకు ఫిరంగిపురం పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు శనివారం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ,బాలకష్ణ ఫ్యాన్స్ అధ్యక్షులు అల్లంశెట్టి మోహన్ రావు ఆధ్వర్యంలోఈ వేడుకలు నిర్వహించారు.అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును అరవిందబాబు కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ నటుడిగా తన నటన ద్వారా అభిమానులను చైతన్య పరచడంతో పాటు హిందూపురం ఎమ్మెల్యేగా ,బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ గా అన్ని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ పాల్గొన్నారు. **అచ్చంపేట:** మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి టిడిపి శ్రేణులకు పంచారు. **విజయపురి సౌత్:** బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు.ముందుగా కేక్ ను కట్ స్థానికులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య,తదితరులు పాల్గొన్నారు. **సత్తెనపల్లి రూరల్ :** బాలకృష్ణ జన్మదిన వేడుకలు మండలంలోని వెన్నాదేవి లో నందమూరి అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతి థిగా హాజరయ్యారు. **నాదెండ్ల:** ప్రముఖ సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని గణపవరం నాదెండ్ల సాతులూరు అమీన్ సాహెబ్ పాలెం కనపర్రు తూబాడు గ్రామాల్లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో నాదెండ్ల మండల టిడిపి పార్టీ నాయకులు బండారుపల్లి సత్యనారాయణ తెలుగు రైతు ఉపాధ్యక్షులు గుర్రం నాగు పూర్ణచంద్రరావు కేక్ కట్ చేసి గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు



తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆధునీకరణ

నాబార్డ్ నిధులు రూ.5కోట్లతో లింక్ రోడ్లు - యార్డు ఆవరణలో రూ.9కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్- కొల్లిపరలో సబ్ మార్కెట్ యార్డుకు సన్నాహాలు

ప్రజాశక్తి-తెనాలి

తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డు ఆధునీకరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. యార్డు ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్, అలాగే రైతుల సౌకర్యార్ధం లింక్‌రోడ్ల నిర్మాణం, ముఖ్యంగా యార్డు ముఖద్వారంలో రైతులను ఆకర్షించే విధంగా ఎడ్లబండిలో రైతు కుటుంబంతో సహా షాపింగ్‌కు వెళుతున్నట్లు చిత్రీకరణ పనులకు అడుగులు పడుతున్నాయి. తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీలో చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలిలా ఉన్నాయి.

దేశవ్యాప్తంగా తెనాలి మార్కెట్ యార్డుకు ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆసియాలోనే అతిపెద్ద నిమ్మకాయల యార్డుగా కూడా పేరుంది. నిత్యం రైతులతో కళకళలాడే యార్డులో పలు రకాల అభివృద్ధి పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. దీనిలో ప్రధానంగా నాబార్డ్ నిధులు రూ.9లక్షలతో యార్డు ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగనుంది. దీనికి ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించగా, సాంకేతిక అనుమతులు లభిస్తే, టెండర్లు ఖరారు చేయనున్నారు. అలాగే యార్డు కార్యాలయంలో రూ.25 లక్షలతో మరమ్మతులు, మరో రూ.20 లక్షలతో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్ రిపేర్లకు శ్రీకారం చుట్టారు. ఇదిలా ఉంటే యార్డు ఆవరణలో రైతులు, సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు ఓ మిని ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనిలో రైతు ఎడ్లబండిలో కుటుంబంతో కలిసి షాపింగ్‌కు వెళుతున్నట్లుగా చిత్రాన్ని రూపొందించి ప్రదర్శించనున్నారు. దీనికి రూ.6లక్షల అంచనా వేశారు. అలాగే లింక్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రైతులు పండించిన పంటలను ఇళ్ళకు చేర్చుకునేందుకు, అలాగే ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వంటివి పొలాలకు చేర్చుకునేందుకు వీలుగా యార్డు పరిధిలో 20 లింక్ రోడ్లను రూ.5కోట్లతో నిర్మించనున్నారు. అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద ఈ నిధులను వెచ్చించనున్నారు.



తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ

ఆధునీకరణ పనులకు చురుగ్గా అడుగులు

-జె.వి.సుబ్బారావు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, ఎఎంసి, తెనాలి



యార్డు అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో ప్రస్తుత పాలకవర్గం హయాంలోనే యార్డులో షాపింగ్ కాంప్లెక్స్, కార్యాలయం మరమ్మతులు, గోడౌన మరమ్మతులు, కొల్లిపరలో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణం, లింక్ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించగా, టెక్నికల్ అనుమతులు లభిస్తే, టెండర్లు కూడా ఖరారౌతాయి.

కొల్లిపరలో సబ్ మార్కెట్ యార్డుకు సన్నాహాలు

తెనాలి మార్కెట్ యార్డు పరిధిలోనే కొల్లిపరలో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ తెనాలి వచ్చిన సందర్భంగా కొల్లిపరలో సబ్ మార్కెట్ యార్డు ప్రతిపాదనను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై స్పందించిన ఆయన సభావేదికపైనే సబ్ మార్కెట్ యార్డుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యార్డుకు కావలసిన ఐదెకరాల భూసేకరణ ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తియినట్లు సమాచారం. ప్రస్తుత పాలకవర్గం గడువు ముగిసే లోగానే కొల్లిపర సబ్ మార్కెట్ యార్డు, పైతెలిపిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తికానున్నట్లు సమాచారం.



రక్త నమోనాలు సేకరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

డోకిపర్రులో రక్త నమూనాలు సేకరణ

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని డోగిపర్రు ఎస్సీ కాలనీ అంబేద్కర్ నగర్‌లో మలేరియా జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో ఇప్పటికే నలుగురికి మలేరియా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. జ్వరం లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి మందులు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. గుంటూరు, మేడికొండూరు కు చెందిన పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి మంటలు

అధికారులు పట్టించుకోవడం లేదంటున్న ప్రజలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని 2వ వార్డు ఎండిఓ ఆఫీస్ ప్రక్కన వరసిద్ధి వినాయక గుడి దగ్గర గల ట్రాన్స్ఫార్మర్ గత కొంతకాలంగా ఓల్టేజ్ సమస్య వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన నేటి వరకు ఎలాంటి పరిష్కారానికి నోచుకోక పోవడం వల్ల శనివారం వోల్టేజ్ సమస్యతో ట్రాన్స్ఫార్మర్ నుండి మంటలు చెరగవేగినాయి. స్థానికులు స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినారు. విద్యుత్ శాఖ వారు ఘటనా స్థలానికి చేరుకోలేదు. సమయానికి అగ్నిమాపక శాఖ వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినారు. విద్యుత్ శాఖ వారి నిర్లక్ష్యానికి స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

16న పెరియార్ సమకాలీనత పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి-తెనాలి:

డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న 'పెరియార్ సమకాలీనత' పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని ఫౌండేషన్ చైర్మన్ బత్తుల విల్సన్ చెప్పారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రం ప్రాంగణంలో శనివారం పుస్తకావిష్కరణ ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని షోయబ్ హాల్‌లో ఉందయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. సభలో ముఖ్యఅతిధిగా ఆంధ్రజ్యోతి ప్రధాన సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్, ప్రధాన వక్తగా వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, విశిష్ట అతిథిగా మాజీ మంత్రి మాణిక్యవం ప్రసాద్, తెలంగాణా రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఉపాధ్యక్షులు ఆరాధ్యుల కన్నా, కోశాధికారి పిట్టుకోటేశ్వరరావు, కొమరాల రవికుమార్, దేవరపట్టి రమేష్‌బాబు పాల్గొన్నారు.

ధనుంజయరావుకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రమాదవశాత్తు కాలికి దెబ్బతగిరి ఇంట్లో చికిత్స పొందుతున్న టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనంజయరావును టిడిపి నాయకులు శనివారం పరామర్శించారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మున్నంగి శివ శేషగిరిరావు, నాయకులు కేసంనేని అనిత, కారంపూడి అంకమ్మరావు, కేశంనేని వాసు, ఆరుద్ర సత్యం, తోకల బాలాజీ, దివి లక్ష్మి భోగి సురేష్ తదితరులున్నారు.



మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ సంస్థ వితరణ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం భోజనం పంపిణీ చేశారు. పొన్నూరు వీరనాల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్ధం వారి కుమారుడు రమాకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సంస్థ అధ్యక్షుడు తిరుమల శెట్టి ఉమా శంకర్, జాహ్నవి, మేఘనాథ్, కార్యదర్శి గుడివాడ పవన్ గోపిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉండవల్లి సెంటర్‌లో నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన సందర్భంగా ఉండవల్లి సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ఉండవల్లి సెంటర్‌లో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



విస్తృతంగా ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

సిఆర్‌డిఏ పరిధిలోని ఎర్రబాలెం లేఅవుట్‌లో తాడేపల్లి పట్టణంలోని డోలాస్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, శివదుర్గాపురం, నులకపేట, మున్సిపల్ కార్యాలయం ప్రాంతం, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వేల మందికి శనివారం ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ దశాబ్ద కాలం నుంచి ఎదురుచూస్తున్న పేదల ఇంటి కలను నేడు వైసిపి ప్రభుత్వం నిజం చేసిందన్నారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి ఇళ్ల నిర్మాణం కూడా చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మహేష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన అధ్యాపకులతో ప్రిన్సిపాల్ తదితరులు

ప్రభుత్వ కాలేజిలో ముగిసిన అధ్యాపకుల శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు : కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంగ్లీషు మీడియం బోధనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18 నోడల్ రిసోర్స్ సెంటర్స్‌లో ఇంగ్లీషు మీడియం బోధన, ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్‌కు ఆరు రోజులపాటు స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజిలో నిర్వహించిన శిక్షణ ముగిసింది. ఈ శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా మొదటి బ్యాచ్‌గా 69 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో జరిగిన ఈ కారక్రమాన్ని కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ ప్రారంభించి, పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి పాల్గొని ఇంగ్లీషు మీడియం ప్రాధాన్యత గురించి అధ్యాపకులకు వివరించారు.



ఇళ్ల స్థలాలు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి-ఫిరంగిపురం

స్థానిక మండలంలోని బేతపూడి గ్రామంలో ఓ వివాహానికి హాజరైన తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌కు బేతపూడి గుండాలపాడు అగ్రహారం మాల దాసులు, ఎస్సీలు రెండు గ్రామాలకు స్మశాన స్థలాలు లేవని, మంచినీటి కుళాయిలు, కరెంటు స్తంభాలు, రోడ్లకు ఇరువైపులా, సైడ్, కాలవలు సీసీ రోడ్లు కావాలని శనివారం వినతి పత్రాలు సమర్పించారు. కనీస మౌలిక వసతులు లేక సుమారు 250 కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నామని ఎన్నిమార్లు అర్జీలు రూపంలో తెలియపరచినప్పటికీ ఫలితం శూన్యం అని వాపోయారు. ఈ సమస్యలపై స్పందించిన కత్తెర సురేష్ కుమార్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బేతపూడి గ్రామ సర్పంచ్ జి ఆదంబి, ఎంపీటీసీ షేక్ ఖాసిం, షహీద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ ఖాజావలి, ఉప సర్పంచ్ వై నాగేశ్వరరావు, గ్రామ వైసిపి ప్రెసిడెంట్ షేక్ షరీఫ్, దారా కాళిదాసు పాల్గొన్నారు.



12న రాయబార కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పైన ఈనెల 12వ తేదీన మంగళగిరి సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద జరుగు రాయబారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ కోరారు. శనివారం ఎంపీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో కౌలు రైతులను కలిసి ఆయన కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని, రైతు భరోసా వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. రైతు సంఘం గ్రామ నాయకులు డోకిపర్తి రాజేంద్ర బాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 సర్వీసులకు సంబంధించి స్థానిక పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్‌లో పరీక్షలు జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి శనివారం పరిశీలించారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి

పరీక్ష జరుగుతున్న తీరుతెన్నులపై చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాధికను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు జరిగిన పరీక్షలకు 692 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 521 మంది అభ్యర్థులు హాజరయ్యారని వివరించారు. 171 మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు. ఈ కేంద్రంలో గ్రూప్-1 పరీక్షలు జూన్ 03వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకూ సజావుగా జరిగాయని, అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగలేదని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నేటితో ముగిశాయని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ నుండి పరీక్ష నిర్వహకులు అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మి, సెక్షన్ అధికారులు రమణ, గిరిజ, పరీక్షల సమన్వయ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ మహబూబ్ బాషా హాజరయ్యారు.

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించిన ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాశ్ శనివారం స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. సదరు పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, విద్యలో అత్యున్నత సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల



ఐఎఫ్‌పి ప్యానల్‌పై రాస్తున్న ప్రవీణ్ ప్రకాష్

నవీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పి)ల పనితీరును పరిశీలించారు. ఈ తరహా బోధనా విధానాన్ని ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్న మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని తెలియజేశారు. గుంటూరు జిల్లాలోని 175 నాడు నేడు ఫేజ్-1 పాఠశాలలకుగాను 621 ఐ.యఫ్.పి (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్)లను 130 పాఠశాలలకు డిజిటల్ టీవిలను ప్రభుత్వం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి పాఠశాల విద్య ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావు, డిఇఒ పి. శైలజ, సమగ్ర శిక్ష ఏపిసి జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యమహా బ్లూస్క్వేర్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక అమరావతి రోడ్డులో లెగస్సీ మోటార్సు వారి 163వ యమహా బ్లూ స్క్వేర్ షోరూమ్‌ను శనివారం వై.ఎం.ఐ.ఎన్.డైరక్టర్ కవై హిదేపుమి, జోనల్ హెడ్ మోహన్ రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా లెగస్సీ మోటార్సు యజమాని గుత్తాచంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో తొలి సారిగా యమహా బ్లూ స్క్వేర్ షోరూమ్ ఇదేనని తెలి


ప్రారంభిస్తున్న వై.ఎం.ఐ.ఎన్.డైరక్టర్ కవై హిదేపుమి

పారు. ప్రపంచ స్థాయి మోటారు సైకిళ్లు, స్కూటర్లు తమ షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. గుంటూరు వాసులు రోజు వారి ప్రయాణానికి ఈవాహనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పయనరీ గ్రూపు ఆఫ్ కంపెనీల చైర్మన్ చుక్కపల్లి రమేష్, షోరూమ్ నిర్వహాకులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పంపిణీలో జాప్యంపై నిరసన

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా టిడ్కో ఇళ్లు పేదలకు అప్పగించడానికి ప్రభుత్వానికి మనస్సు అంగీకరించడం లేదని తెలుగుయువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయి ఆరోపించారు. గుంటూరులోని అడవితక్కెళ్లపాడు వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. తెలుగుదేశం ప్రభుత్వం కట్టిన టిడ్కో ఇళ్ళు లబ్దిదారులకు పంచకుండా రంగులు వేసి కాలక్షేపం చేస్తున్నారని అన్నారు. టిడ్కో ఇళ్ల పంపిణీలో జరుగుతున్న జాప్యానికి లబ్ధిదారులతో కలిసి ఆయన నిరసన తెలియజేశారు. టిడిపి హయంలో 90 శాతం ఇళ్లుపూర్తి చేయగా మిగిలిన 10 శాతం ఇళ్ల నిర్మాణానికి నాలుగేళ్లు పట్టిందన్నారు. గుంటూరులోని అడవితక్కెళ్లపాడు, వెంగళాయ పాలెంలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, గుత్తికొండ కిరణ్ యాదవ్, చెరుకుపల్లి నాగరాజు, షేక్ షుకూర్, సింగు గోపి కృష్ణ, నాగిశెట్టి నాగరాజు, తులసి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



అడవితక్కెళ్లపాడులో నిరసన ప్రదర్శన చేస్తున్న తెలుగుయువత కార్యకర్తలు

రేపు వ్యవసాయ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

లాంలోని ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ వ్యవస్థాపక దినోత్సవం ఈనెల 12వతేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు వైస్ ఛాన్సలర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. లాంలోని విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మట్లాడారు. విశ్వవిద్యాలయంలోని కృష్ణా ఆడిటోరియంలో ఈసభ జరుగు తుందన్నారు. రాష్ట్ర విభజన తరువాత 2016లో లాంలో ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయం క్రమంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నూతన వంగడాలను కనుగొనడం, విద్యార్థులకు మెరుగైన బోధనలు, రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల ద్వారా సలహాలు సూచనలు అందించడం తదితర అంశాలపై దృష్టిసారించినట్టు తెలిపారు. డ్రోన్‌ల ద్వారా ఇప్పటికే పురుగుమందుల పిచికారి కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందన్నారు. అలాగే పంటలపై వస్తున్న చీడపీడలనివారణకు తగిన చర్యలు, నివారణపై అధ్యయనం జరుగుతుందన్నారు. వ్యవస్థాపక దినోత్సవంకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి, ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్స్ వెరయిటీస్ చైర్‌పర్సన్ డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర, వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ, వ్యవసాయశాఖ కమిషనర్ సి.హరికిరణ్, పశు సంవర్ధకశాఖ డైరక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ తదితరులు పాల్గొంటారని ఆయన వివరించారు.

విద్యుత్ ఛార్జీల భారం సశేషం!

వీక్షణం

సంక్షేమ పథకాలే తమను వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తాయని సిఎం జగన్‌తో సహా వైసిపి పెద్ద నాయకులంతా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. ప్రధానంగా ప్రజలపై ప్రత్యక్షంగా ఆర్థిక భారం మోపుతున్నారు. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల పెంపు ప్రజలను తీవ్రంగా ఇబ్బందికి గురిచేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఆస్తి పన్నుపెంపు భారం కూడా ప్రజలను వెంటాడుతోంది. గతంలో ఉన్న పన్నుల కన్నా 15 శాతం వరకు ఆస్తి పన్ను ఏటా పెంచుతున్నారని పట్టణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. అలాగే విద్యుత్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి ప్రజల్లో పాలకులపై తీవ్ర వ్యతిరేకతను తెచ్చిపెడుతున్నాయి. ఎడం చేత్తో సంక్షేమ పథకాల సొమ్ము ఇస్తూనే కుడిచేత్తో నేరుగా వివిధ రూపాల్లో భారం మోపుతున్నారన్న విమర్శలు ప్రభలంగా విన్పిస్తున్నాయి. విద్యుత్ చార్జీల రూపంలో అదనపు వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గృహ విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం విపరీతమైన భారం పడుతుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 17.50 లక్షల మందిపై వినియోగదారులు ఉండగా వీటిల్లో 17 లక్షల మంది పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారు. జిల్లా వాసులపై ఏటా రూ.50 కోట్లకుపైగా అదనపు భారం పడుతోంది. సాధారణ వినియోగ ఛార్జీలతో పాటు ట్రూఅప్ ఛార్జీలు ప్రతి యూనిట్‌కు సగటున 1.50 పైసలు భారం పడనుంది. వీటిపై స్థిర ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఆలస్యానికి అదనపు రుసుము కూడా పడనుంది. గత నాలుగేళ్లలో ఏడుసార్లు ఛార్జీలను పెంచారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రతి నెలా వసూలు చేస్తున్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో 36 నెలల పాటు అదనపు ఛార్జీలను వసూలు చేస్తున్నట్టు విద్యుత్ బిల్లును వసూలు చేస్తున్నారు. ఇప్పటికి 10 నెలలుగా ఈఛార్జీలను వసూలు జరుగుతోంది. ట్రూఅప్ వల్ల ప్రతినెలా రూ.30 నుంచి రూ.100 వరకు అదనపు భారం పడుతోంది. 2014-2019లో డిస్కంలకు వచ్చిన నష్టాలకు సంబంధించి ఇప్పుడు వసూలు చేయడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఈఛార్జీల వసూలు పరంపర కొనసాగిస్తూనే తాజాగా 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డిస్కంలకు వచ్చిననష్టాలకు కూడా గత నెల బిల్లు నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. యూనిట్‌కు రూ.40 పైసలు అదనంగా వసూలు చేయనున్నారు. ఇలా ఏడాదిపాటు ఈభారంపడుతుంది. మార్చినెల బిల్లులో ఇంధన సర్దుబాటు ఛార్జీలు భారీగానే వసూలు చేశారు. మరో వైపు స్థిర ఛార్జీలను కూడా పెంచారు. వాస్తవంగా వినియోగించుకున్న యూనిట్లకు కన్నా ఇతరఛార్జీల భారం రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. సాధారణ వినియోగదారులకు గత ప్రభుత్వంలో తమకు రూ.300 లోపు బిల్లు వచ్చేదని గత నాలుగేళ్లలో వివిధ రూపాల్లో పెరిగిన విద్యుత్ ఛార్జీల వల్ల క్రమంగా ఈ బిల్లులు రూ.500 దాటిపోతున్నాయని పేద వర్గాలు వాపోతున్నాయి. రానున్న రెండేళ్లపాటు ట్రూ అప్ ఛార్జీల భారం కొనసాగనుంది.మరో వైపు ఆర్‌టిసి ఛార్జీలు కూడా గత మూడేళ్లక్రితం కంటే రెట్టింపుఅయ్యాయి. ప్రధానంగా ఆర్డినరీ సర్వీసులపై కూడా అదనపు భారం భారీగా ఉంటోంది. ప్రైవేటు వాహనాల కన్నా ఆర్‌టిసి ఛార్జీలే కొన్ని చోట్ల ఎక్కువగా ఉంటున్నాయి.

(ఎవిడి శర్మ)

ఏటుకూరు లేఅవుట్‌ను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏటుకూరు లేఅవుట్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. పేదలందరికీ ఇళ్లు, జగనన్న ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఏటుకూరులోని 5 లేఅవుట్‌లలో ఇప్పటి వరకూ గృహ నిర్మాణ పనుల పురోగతిపై హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వేణుగోపాల్ జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి వివరించారు. 9,619 గృహాలను మంజూరు చేయగా, 6,621 గృహాలు బి.ఎల్ స్థాయిలో, 616 గహాలు రూఫ్ లెవెల్ వరకూ, 146 గృహాలు శ్లాబ్ దశకు, 857గృహాలు కంప్లీషన్ దశకు వచ్చాయన్నారు. రూఫ్ లెవెల్, శ్లాబ్ దశ వరకూ వచ్చిన గృహాలను పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. మూడవ ఆప్షన్ కింద నిర్మిస్తున్న గృహాలకు సంబంధించి ఐసిఐసిఐ బ్యాంక్‌లో మిగిలిన లబ్దిదారుల ఖాతాలను వెంటనే తెరవాలని అధికారులకు సూచించారు. లేఅవుట్‌లో మిగిలిన ఎలక్ట్రికల్‌లైన్ పనులను పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. మరణించిన లబ్దిదారుల స్థానంలో వారి కుటుంబంలోని చట్టబద్ధ వారసులకు సంబంధించి అనుమతి ఉత్తర్వులు ఎప్పటికప్పుడు జారీ చేయడం జరుగుతున్నదని, ఆ మేరకు లబ్దిదారులను చైతన్య పరచి బ్యాంక్


బ్రిక్స్ రాయిని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల రెడ్డి తదితరులు

ఖాతాలను తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేఅవుట్‌లో గృహ నిర్మాణాల పనులు చేపట్టేందుకు అవసరమైన అన్నీ మౌలిక వసతులైన సిమెంటు, ఇసుక, ఇనుము, విద్యుచ్ఛక్తి, నీరు ఏర్పాటు చేయడం జరిగినందున గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించి వున్నందున ఎప్పటికప్పుడు పనులు పూర్తైన వాటికి సంబంధించి చెల్లింపులకు బిల్లులు అప్లోడ్ చేయాలని హౌసింగ్ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరరావు, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటీ కమిషనర్లు వెంకట కృష్ణయ్య, శ్రీనివాసరావు, ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతి రాజ్, జిఎంసి నోడల్ అధికారి కొండా రెడ్డి, గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్లు, ఏమినిటీస్ సెక్రటరీ లు పాల్గొన్నారు.